# బృందావనం

తెల్లవారుతోంది.
తూరుపు నుదుట బొట్టుతో
నింగి సింగరించుకుంటోంది.
నిండు సూరీడుకి దండంపెట్టి
చేత చద్ది, కంబళి పట్టి
గంగి గోవులను తోలుకుంటూ
పిల్లనగ్రోవిని ఊదుకుంటూ
సంబరంగా బయలుదేరాను.

దారి పొడుగునా
అడుగు అడుగునా
అందమైన పలకరింపులు
పులకరించే మనసుపొరపై
గిలిగింతల సంతకాలు.

ఝుం ఝుమ్మంటూ తియ్యని తుమ్మెద గానం
జలజలమంటూ పిల్ల కాలువ పరుగుల పయనం
పదం పాడుతూ పంట పనుల్లో పడుచులు
సగం మత్తులో వయ్యారి గోదారిపై మరపడవలు.

ఎంతెంత దూరం
ఇంకెంత దూరం
కన్నతల్లుల కడుపు నింపే
అమ్మ ప్రకృతి చేతి చలవది-
పచ్చ పచ్చని దిగుడు మెట్ట
ఇంకెంత దూరం?

'వచ్చేసామొచ్చేసాం
ఇదిగిదిగో వచ్చేసా'మని
చెప్పాలనేమో
గంగమ్మతల్లి హుషారు
'అంబా అంబా' అంటూ
ముద్దు మాటల జోరు.

అమ్మ ఒడికై చిందులేసి
అమ్మ ఒడిలో సేద తీరుతు
చిలిపి నవ్వులు నవ్వుతున్న
చిట్టి తల్లుల ముద్దురూపం -
నేలనంతా తెరని చేసి
నిండు మనసుని కుంచె చేసి
మురిపెంతో గీసిన
ఏకవర్ణ తైలచిత్రం.

ఆ చిత్రాన్నే చూస్తూ
ఆ అందం చూసి మురుస్తూ
నన్ను నేను మరుస్తూ ఉండగా..
అంతలోనే సూరీడు ఎరుపెక్కిపోయాడు
సంధ్యవేళయిందని
భూమికావల పనుందని
పడమటి దిక్కుకు పరుగులెత్తాడు.

సరిసరి వెళ్ళొస్తామని
వెళ్ళి మళ్ళొస్తామని
అమ్మకి చెబుతూ
తీపి గురుతులు తీసుకెళుతూ
ముచ్చటైన రోజుకు ముగింపు చెప్పాము.

25 డిసెంబరు 2006